ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

పార్వతీపురం మన్యం

11,12న మన్యం బంద్

ప్రజాశక్తి- సీతంపేట

ఆదివాసి అఖిలపక్ష ప్రజా సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 11,12 తేదీల్లో 48 గంటలు నిరవధిక మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎం.తిరుపతిరావు, బి.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని, షెడ్యూల్ ఏరియాలో 100శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియమామక చట్టం చేయాలని, 1/70 చట్టాన్ని సవరించాలని, స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై స్పష్టమైన ప్రభుత్వ వైఖరి ప్రకటించాలన్న అంశాలపై బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విజయగౌరి నామినేషన్

- విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి కదిలొచ్చిన ఉపాధ్యాయులు
- గెలుపుతో ఉత్తరాంధ్రలో చరిత్ర లిఖించాలని వక్తలు పిలుపు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి విజయగౌరి విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంభిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రెంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో 50వేల మంది టీచర్లు పోరాడినప్పుడు ఎంఎల్‌సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టకపోతే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాదని, ఉపాధ్యాయులకు కష్టాలొచ్చినప్పుడు కనపడని వారు నేడు పోటీకి సై అంటున్నారని అన్నారు. అటువంటివారిని విద్యావంతులైన టీచర్లు ఓడించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేస్తోందని, పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తేనే దీన్ని అడ్డుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్రనాయకులు ఎస్ఎస్.నాగమణి, టిఆర్.అంబేద్కర్, చినబ్బాయ్, విజయనగరం, మన్యం జిల్లాల నుంచి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, కోశాధికారి రెడ్డి మోహనరావు, నాయకులు డి.రాము, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, రమేష్‌చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

సభనుద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ర్యాలీలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సంక్షేమమే అజెండా : విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. విద్యా రంగంలో జిఒ 117ను సంపూర్ణంగా రద్దు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానన్నారు. పాఠశాలల మూత ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని గొంతెత్తుతానన్నారు. యాప్‌ల భారం ఉపాధ్యాయులకు ఉండకుండా చేస్తానన్నారు. విద్యారంగాన్ని రక్షించే పోరాటాలు సాగిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిచేలా అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌కు నామపత్రాలు దాఖలు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిసిసి ఎండీ కల్పనాకుమారి

విడివికెలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలో వన్ ధన్ వికాస కేంద్రాల (విడివికె) కార్యకలాపాలను మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 68, సీతంపేట ఐటిడిఎ పరిధిలో దాదాపు 54 విడివికెలు ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతంలో లభించే ముడిసరుకులైన కొండ చీపుర్లు, చింతపండు, పసుపు, జీడిపప్పు, మినుములు, సబ్బులు మొదలైన వాటి ద్వారా విడివికెలు వ్యాపారం చేస్తూ అగరబత్తులు, చిరు ధాన్యాల బిస్కెట్లు, చింతపండు తదితరాలను ఉత్పత్తి చేస్తున్నారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ ప్రాంతాలు కొండ చీపుర్లు, పసుపు, చింతపండు, జీడిపప్పు లభ్యత ఎక్కువగా ఉంది. జిల్లాలో దాదాపు 65 వేల హెక్టార్లలో జీడి సాగు జరుగుతుండగా, కేవలం సీతంపేట ప్రాంతం నుంచే దాదాపు 7 లక్షల కొండ చీపుర్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు నాణ్యమైన, పరిమాణాత్మక ఉత్పత్తులు, బ్రాండింగ్, ప్యాకింగ్‌తో పాటు మంచి మార్కెటింగ్‌ను అందించాలని ఆలోచించారు. దీని కోసం గ్రూపులకు యంత్ర పరికరాలు, అన్ని అంశాల్లో శిక్షణ వంటి అన్ని రకాల లాజిస్టిక్స్ అందించడం వల్ల మరింత లభిస్తుందని చర్చించారు. జీడిపప్పు – పార్వతీపురం, సీతంపేట విడివికె క్లస్టర్లు, చింతపండు – గుమ్మలక్ష్మీపురం, కొండ చీపుర్లు – సీతంపేట తదితర క్లస్టర్ల వారీగా యూనిట్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఆ క్లస్టర్లలో మార్చి 15 నాటికి అన్ని రకాల యంత్రాలను సమకూర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్పత్తులు పూర్తిగా సేంద్రీయంగా ఉండడం వల్ల దేశవ్యాప్తంగా మంచి మార్కెటింగ్ ఉండగలదని విశ్వసిస్తున్నారు. జిల్లా ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 16 నుంచి 26 వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆది మహోత్సవాన్ని వినియోగించుకోవాలన్నారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పోర్ట్ ట్రస్ట్, టాటా, టిటిడి, ట్రైఫెడ్, ఎపిటిడిసి తదితర సంస్థలతో సమన్వయం చేసుకుని ఉత్పత్తులను పెద్ద ఎత్తున విక్రయించాలని అధికారులు నిర్ణయించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిగా సేంద్రియ ఉత్పత్తులేనని, ఈ ఉత్పత్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యకలాపాలు నిర్వహించేందుకు విడివికెలను బలోపేతం చేసేందుకు రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన వర్కింగ్ క్యాపిటల్ కోసం కనీసం కోటి రూపాయలు అందించాలని జిసిసి ఎండీని కోరారు. పివిటిజి (ప్రిమిటివ్ వాల్యూనర బుల్ ట్రైబల్ గ్రూప్)తో విడివికె గ్రూపులు ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. జిసిసి ఎండి కల్పనా కుమారి మాట్లాడుతూ అనేక శాఖలు, సంస్థలతో కలిసి ఉత్పత్తులను విక్రయించవచ్చని అన్నారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిసిసి జిఎం జనరల్ మేనేజర్ సంధ్య, డిఎం వి.మహేంద్రకుమార్, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, సీతంపేట డిపి సన్యాసిరామారావు, ఎపిడిఎం సన్యాసి, రామారావు పాల్గొన్నారు.

స్టెమి గుండె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిహెచ్‌సి సూపరింటెండెంట్ శోభారాణి, సిబ్బంది

స్టెమీ చికిత్సతో గుండెకు భరోసా

ప్రజాశక్తి – కురుపాం

గుండె జబ్బుల మరణాలను నివారించేందుకే స్టెమీ చికిత్స గుండెకు భరోసా కలిపిస్తుందనీ కురుపాం సిహెచ్‌సి సూపరింటెండెంట్ బి.శోభారాణి అన్నారు. గురువారం సిహెచ్‌సిలో ఆశా వర్కర్లకు, ప్రజలకు స్టెమీ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాతి నొప్పి, ఎడమ భుజం లాగటం, ఆయాసం ఉండటం, గుండె దడ, నీరసంగా ఉండడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తమై దగ్గరగా ఉన్న ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.45వేలు విలువ చేసిన స్టెమి ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఇంజక్షన్ గుండె నిలుపుదల చేసి తదుపరి ట్రీట్మెంట్ చేయడానికి జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలించి ఈసీజీ ఆపరేషన్ చేసి ప్రాణాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందని, ఇది ప్రజలందరూ గమనించి ఎవరికైనా ఇటువంటి లక్షణాలు కలిగితే వెంటనే ఆస్పత్రులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కె.సునీల్‌కుమార్, కె.సందీప్, సాయిప్రసాద్, మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్టేమి చికిత్సతో గుండెను భద్రపర్చుకోవచ్చని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. గురువారం వైద్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రమ్య, త్రివేణి, రవికుమార్, రాజన్, రామకృష్ణ, దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల సమగ్ర వివరాలివ్వండి : కలెక్టర్

పార్వతీపురం :జిల్లాలోని)సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన సమగ్ర వివరాలను అందివ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. పట్టణంలో గల పరిశ్రమల్లో గురువారం సర్వే నిర్వహించారు. పేపర్ ప్లేట్లు, పరుపుల తయారీ పరిశ్రమలను సందర్శించి యజమానులతో మాట్లాడారు. ఉత్పత్తుల తయారీకి వినియోగించే ముడి సరుకు, మార్కెట్‌లో ఉత్పత్తులను విక్రయయిస్తున్న విధానాలపై ఆరాతీశారు. పరిశ్రమ స్థాపనకు పెట్టుబడి, ప్రస్తుత ఆదాయం, ఎంతమందికి ఉపాధి కల్పిస్తున్నది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

కాల వ్యవధిలోగా మ్యుటేషన్లు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురం

రీసర్వే, రెవెన్యూ సదస్సులు, మీ సేవా పోర్టల్ ద్వారా వచ్చే మ్యూటేషన్లను నిర్ణీత కాల వ్యవధిలోగా (30 రోజులు) పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహశీల్దార్లకు తెలిపారు. 30 రోజులు దాటి ఒక్క రోజు ఆలస్యమైనా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యలపై సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని గురువారం కలెక్టర్ తన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. దీనిపై సంబంధిత సబ్ కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రీసర్వే, రెవెన్యూ గ్రామ సభల్లో అనేక ఫిర్యాదులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకం వచ్చేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఈలోగా 1-బిని భూ యజమానులకు అందించాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక సాయంతో పాటు రుణాలు తీసుకునేందుకు, ఇతరత్రా వాటికి ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. రీసర్వేలో అధికంగా భూసమస్యలు వచ్చినందున అడంగల్, మ్యూటేషన్, 1-బి తదితర వాటిపై గ్రామ రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సరైన పరిష్కార మార్గాలను వివరించాలని సబ్ కలెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. తుది ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్) అంటే భూమికి సంబంధించిన వివిధ హక్కులను వివరించే కీలకమైన పత్రమని, అందులో భూ యాజమాన్యం, అద్దె, భూ వినియోగం, ఇతర సంబంధిత సమాచారం ఈ పత్రంలో ఉన్నందున క్షేత్రస్థాయిలో పరిశీలించి జారీచేయాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, భూ సర్వే, ల్యాండ్ రికార్డుల అధికారి, మండల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

వ్యాపారులు మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

కళాసీల సమస్యల పరిష్కారంలో వ్యాపారస్తులు మొండివైఖరి వీడి పరిష్కారం వైపు అడుగులు వేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని పట్టణంలో గల నాలుగు రోడ్డు సెంటర్లో వర్తక కళాసీల చేపడుతున్న నిరసన గురువారం ఐదో రోజుకు చేరుకుంది. వీరి నిరసనకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో కుటుంబ పోషణ కష్టమవుతుందని, కార్మికుల శ్రమను, కష్టాన్ని వ్యాపారస్తులు అర్థం చేసుకొని వేతన ఒప్పందం చేయాలని కోరారు. సిమెంటు, ఐరన్, కూరగాయలు, కొబ్బరికాయలు యాజమాన్యాలు వేతన ఒప్పందానికి అంగీకరించడం శుభ పరిమాణమన్నారు. అయితే కిరాణా, రవాణా వ్యాపారులు అంగీకరించకపోవడం అన్యాయమని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.సర్వేశ్వరరావు సింహాద్రి, ఆర్.సర్వేశ్వరరావు, లక్ష్మయ్య, తిరుపతిరావు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

గోదాములో తనిఖీలు

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని సూరంపేటలో ఎఎన్ఆర్ గోదామును ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని బఫర్ గోడౌన్‌ను సందర్శించి, అక్కడ స్టాకును పరిశీలించారు. రికార్డుల పరంగా సరుకులను పరిశీలించిన ఆయన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదామును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

తక్షణమే పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి – వీరఘట్టం

రీ సర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కారం అయ్యేలా చూడాలని పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణను ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక సందర్శించారు. వచ్చిన అర్జీలను పరిష్కారం చూపాలని, పదే పదిసార్లు అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించవద్దని సిబ్బందికి సూచించారు. వీటి విషయంలో నా వరకు ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అర్జీల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.లక్ష్మునాయుడు ఉన్నారు.

బాల్య వివాహాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

బాల్యవివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా, గ్రామాల్లో ఈ దురాచారం నివారణకు మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి టి.కనకదుర్గ అన్నారు. ఈ మేరకు ఆమె స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవ్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణతో కలిసి చేతుల మీదుగా జిల్లా బాలల సంరక్షణ, లైంగిక దాడులు నివారణ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె జిల్లాలో గల అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, మహిళా పోలీస్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, సిడిపిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే మన్యం జిల్లాలో బాల్యవివాహాల నివారణకు జిఒ 31, 39 ప్రకారం స్టేషన్ హౌస్ ఆఫీసర్, మహిళా సంరక్షణ కార్యదర్శులు చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబ్షన్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. మహిళా పోలీసులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రామ సెక్రెటరీ, విఆర్ఒ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిడిపిఒలు బాల్యవివాహాల నివారణ అధికారులుగా విధులు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణ అండ్ మౌనిటరింగ్ కమిటీలు గ్రామస్థాయిలో ఏర్పాటయ్యాయని, వాటిని బలోపేతం చేసి ఫంక్షనింగ్ అయ్యేలా గ్రామస్థాయి సిబ్బంది కృషి చేయాలని కొనియాడారు. అలాగే కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కౌమారదశలో ఉన్న బాలబాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి మళ్లీ, వారి ఆరోగ్యం, విద్య, న్యూట్రిషన్ గ్రోత్, రక్తహీనత, లైఫ్ స్కిల్స్, సెల్ఫ్ డిఫెన్స్, లైంగిక దాడులపై, ఋతు చక్ర పరిశుభ్రత మొదలగు విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామస్థాయిలో గ్రామ పిల్లల సంక్షేమ, పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల ద్వారా పిల్లలకు దిశ నిర్దేశం చేయాలని మహిళ కార్యదర్శులకు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

మాట్లాడుతూ గ్రామస్థాయిలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలోకి చేర్చాలన్నారు. పిల్లల కోరిక మేరకు వృత్తి విద్యా కోర్సులను అడ్మిట్ చేయాలని కోరారు. అలాగే పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టాలని గ్రామస్థాయిలో గల హై స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఉన్న ఆడ, మగ పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో అనధికార దత్తత జరగకుండా చూడాలని, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని అన్నారు. మన జిల్లా, మండలాల్లో ఎక్కడా ఎలాంటి లైంగిక దాడులు జరగకుండా పిల్లలందరికీ చట్టాలపై అవగాహన కల్పించాలని మహిళా కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు సిఐలు, ఎస్ఐలు, బాలల సంరక్షణ విభాగం, లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ పి శ్రీధర్ పాల్గొన్నారు.

గిరిజన భూములకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని కుడుమూరు రెవెన్యూలో 48 సర్వే నెంబర్‌లో తాతల కాలం నుంచి సాగుచేస్తున్న గిరిజనుల భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుడుమూరు భూ పోరాట కమిటీ నాయకులు సూకురు అప్పలస్వామి, కొర్ర రాజేష్ ఆధ్వర్యంలో గిరిజనుల సాగు చేస్తున్న భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కిందట గత ప్రభుత్వం సర్వే చేసిన వివరాలను నేటికీ బయట పెట్టకుండా రెవెన్యూ అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సందర్భంగా కూడా గిరిజనులకు ఏ విషయమూ చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుచేస్తున్న గిరిజనుల భూములకు పట్టాల మంజూరు చేస్తామని రెవెన్యూ సదస్సులో చెప్పిన అధికారులు పట్టించుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. దశాబ్దకాలం పైగా పోరాటం చేసిన నేటికీ పట్టించుకోకుండా కాలయాపన చేయడం గిరిజనులు అన్ని విధాలా నష్టపోతున్నారని మండిపడ్డారు. 48 సర్వే నంబర్‌లో ఉన్న 782 ఎకరాలు ప్రభుత్వ భూమి అని రికార్డులు చెబుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమస్య కొద్ది రోజుల్లో పరిష్కారం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తు పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన మహిళలు, గిరిజన సంఘం నాయకులు కొర్ర సుబ్బారావు, సిపిఎం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు

ప్రజాశక్తి
www.prajasakti.com

బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు, కూలీలు

ఉపాధి హామీకి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - సీతానగరం

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని చినబోగిలి గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి గురువారం బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలని కోరుతూ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఈ విధానాన్ని ఉపాధి కూలీలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రోజుకు రూ.500 ఇవ్వాలని 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చందనపల కృష్ణ, బి.అప్పారావు, పైడిపునాయుడుతో పాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తుకు గడువు పెంపు

ప్రజాశక్తి - కురుపాం

మద్యం షాపుల దరఖాస్తుకు టెండర్ గడువు పెంచినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేది వరకు గడువు పెంచామన్నారు. నియోజకవర్గంలోని కల్లుగీత కార్మికులకు అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వారి క్యాస్ట్ సర్టిఫికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, మూడు పాస్ ఫొటోలు, రెండు లక్షల డిడితో పాటు ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

తోటపల్లిలో శ్రీవెంకటేశ్వరస్వామి నూతన ఆలయం, విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, విష్ణు సూక్తపారాయణం, సేవాకాలం, ద్రవిడ ప్రబంధం, మండపారాధనలు, మూర్తి ప్రబంధం, మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్టాపన, పంచగవ్యాధి వాసం, హోమాలు, క్షీరాధివాసం, అధి వాస హోమాలు, జలాధివాసం, ప్రాయశ్చిత్త హోమం, దాన్యాధివాసం, నీరాజనం, మంత్ర పుష్పములు, పంచశయ్యాధివాసం, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించామని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కొడవగంటి వెంకటనర సింహాచార్యులు, జంధ్యాల జగన్నాధ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు వివి అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న మండువేసవిని దృష్టిలో పెట్టుకుని గుమ్మలక్ష్మీపురం గ్రామంలో పాడైన బోర్లకు మరమ్మత్తులు చేపడుతున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఆర్‌టిపి కాంప్లెక్స్ ఆవరణంలో పాడైన తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. మరోవైపు రక్షిత నీరు ప్రజలకు పుష్కలంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీధుల్లో ఎక్కడైనా బోర్లు పాడైతే తమకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో విద్యుత్ దీపాలు, పారిశుధ్య కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

గోశాలల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం పెదబుడ్డిడి పంచాయతీ పరిధిలో మంజూరైన గోశాలలు, పాఠశాలల ప్రహరీ గోడల పనులను ఎంపిడిఒ శంబంగి రమేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. నాణ్యతా లోపం లేకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఉద్యోగుల స్ఫూర్తి అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజాం వెంకటరమణ విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో (టోపీ రమణ) మృతి చెందడంతో నగర పంచాయతీ సచివాలయ ఉద్యోగులు వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ మేరకు గురువారం రమణమూర్తి భార్యకు సచివాలయ ఉద్యోగుల తరపున రూ.10వేలు నగదును రమణమూర్తి ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల ప్రతినిధి పి.వాసుదేవరావు, శివకృష్ణ మాట్లాడుతూ రమణమూర్తి అకాల మరణం తమను కలచి వేసిందన్నారు. ఉడతా భక్తి సహాయం అందించడం జరిగిందని వెల్లడించారు. సహాయం అందించిన వారితో పాటు గోవింద నాయుడు, షారుక్‌ఖాన్, రవి తేజ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎంప్లాయీస్ పెన్షన్ విభాగం జిల్లా అధ్యక్షులుగా పుష్పనాథం

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి ఎంప్లాయిస్ పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎద్దు లిల్లీ పుష్పనాథం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి, వైసిపి రాష్ట్ర ఎంప్లాయిస్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డికి, మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు పరీక్షిత్‌రాజ్‌కు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు మాజీ ఎమ్మెల్యే కళావతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రతిష్ట పెరిగేలా మరింత బాధ్యతతో పని చేస్తానని చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్యం మెరుగునకు, తాగునీటి సమస్య పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం వీరు నగర పర్యటన చేపట్టారు. ప్రధానవీధులతో పాటు పలు రహదారులను సందర్శించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై ఉన్న చెత్తను దగ్గరుండి సిబ్బందితో తొలగించారు. అదేవిధంగా ఎండల ప్రభావం తీవ్రంగా కావడంతో తాగు నీటి సరఫరాపై కూడా ఆరా తీశారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా వెంటనే స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఒడిశా మద్యం స్వాధీనం

కురుపాం: మండలంలోని దుడ్డుఖల్లుకు చెందిన వ్యక్తి ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తెచ్చి అమ్ముతున్న సమాచారం తెలుసుకున్న కురుపాం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు డిటిఎఫ్ బృందంతో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అతని వద్ద రూ.9వేలు విలువ గల 48 సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, సారా, మద్యం తరలించినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని పీకోనవలస చెక్ పోస్ట్ సమీపంలో గల ఆంధ్ర ఒడిస్సా ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల అందించిన వివరాలు ప్రకారం.. సాలూరు నుండి స్కూటీపై ఒడిస్సాకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఘాట్ రోడ్డు మీదుగా ఒడిస్సా వెళ్తున్నారు. ఒడిస్సా నుంచి సాలూరు వైపు ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి అదుపుతప్పి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీ నుజ్జు నుజ్జు అయి స్కూటీ పై వస్తున్న ఇద్దరిలో ఒక వ్యక్తి అక్కడకక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ క్లీనర్‌కు గాయాలయ్యాయి. వీరిద్దరిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు అవసరమని, అన్ని పథకాలకు ఈ సంఖ్యతో అనుసంధానం అవసరం కావున త్వరగా వీటిని జారీ చేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని కోటికిపెంట రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల అనుసారం గుర్తింపు సంఖ్యల జారీ వేగవంతం చేయాలని, విత్తనాలు, ఎరువుల పంపిణీ, పంట రుణాలు, పంటల బీమా, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి అన్ని పథకాలకు ఈ సంఖ్య అవసరమని తెలిపారు. కావున వివిఎలు రైతులకు అందుబాటులో ఉండాలని, ఈ క్రమసంఖ్యల జారీలో గ్రామంలో పెద్దలకు, రైతులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైతే క్రమసంఖ్యలు జారీ చేసే విషయంలో దండోరాలు కూడా వేయించాలని

మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

తెలిపారు. రైతులు విధిగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించి క్రమసంఖ్యలను పొందాలని దీనికి గాను రైతులు తమ పొలం ఆన్లైన్లో ఉండాలని, ఫోన్ నెంబర్ ఆధార్‌తో అనుసంధానం జరగాలని తెలిపారు. ముందుగా భూ యజమానులకు జారీ చేసిన తర్వాత కౌలుదారులకు, డి-పట్టాదారుకు, ఇతర వ్యవసాయదారులకు క్రమ పద్ధతిలో ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు జారీ చేస్తామని తెలిపారు.

కర్రివలసలో గులి రాగి

రైతులు కంది అప్పన్న, కంది త్రినాధ పొలంలో ప్రకతి సేద్య ఎల్ టు నరసింహమూర్తి ఆధ్వర్యంలో గులిరాగి ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గులిచోడి పద్ధతిలో దిగుబడులు దాదాపు రెట్టింపు అవుతాయని, గులి పద్ధతిలో చోడి పంట నాటాలంటే 20 రోజులు లోపు నారు ఒక్కొక్క మొన అడుగున్న దూరంలో నాటుకోవాలన్నారు. నారు ముదిరితే రెండు, మూడు మొనలు అడుగు దూరంలో నాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఎంటి శ్రీరాములు నాయుడు, ఎల్ వన్ కరి శ్రీను, ఐఎఆర్‌పి సుమలత పాల్గొన్నారు.

శీతల గిడ్డంగిని రైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

శీతల గిడ్డంగిని రైతులు వినియోగించుకోవాలని ఉద్యానశాఖ అధికారి బి.శ్యామల కోరారు. మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధిలో గల వెంకమ్మసాగరం వద్ద రైతు ఉత్పత్తిదారుల సమస్త ద్వారా నిర్మించిన శీతల గిడ్డంగిని గురువారం ఆమె పరిశీలించారు. రైతులు పండించే పంటకు అధిక ధరలు వచ్చేంత వరకు ఇందులో నిల్వ చేసుకొని లాభాలు పొందవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ టి.అమరేశ్వరి, ఎఫ్‌పిఒ అధ్యక్షులు కరణం చిన్ననాయుడు, ఎపిఎం కె.రాము, ఎఫ్‌పిఒ సిసి వై.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు : సిఐటియు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అసారడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్, నైట్ వాచ్మెన్ నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయని గురువారం ఓ దినపత్రికలో వచ్చిన వార్త అవాస్తవమని, నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్, నైట్ వాచ్మెన్ తొలగింపులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, వారిని తొలగించే ముందు నోటీసులు కమిటీ సభ్యులు జారీ చేయలేదని అన్నారు. త్రీ మ్యాన్ కమిటీ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయలేదన్నారు. కార్యాలయాల్లో కూర్చొని రాజకీయ నాయకుల ఒత్తిడికి గురై బలవంతపు సంతకాలు చేశారని ఆరోపించారు. వీరు ఎటువంటి తప్పు చేయలేదనిఎంఇఒ కె.శ్రీనివాసరావు కూడా చెప్పారన్నారు. అలాగే ఎంఇఒ కోర్టు ఉత్తర్వులను గౌరవించి చేసిన తీర్మానాన్ని వెనుక్కు తీసుకుంటానని చెప్పి మళ్లీ కోర్టు ఉత్తర్వులు విరుద్ధంగా వ్యవహరించారని అన్నారు. మండల స్థాయి టిడిపి నాయకులు, ఎమ్మెల్యే నుంచి తీవ్రమైన ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. దళిత, గిరిజనులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని చెప్పిన ఎమ్మెల్యే ఈరోజు గిరిజనుల జీవితాలపై దాడులు చేయడం, వారి జీవితాలను రోడ్డున పడేయడం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యే మాటల్లో కాదు చేతల్లో చూపించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలను మాత్రమే రాయాలని, పత్రిక విలువలను పెంచేలా కార్మికులకు అండదండగా ఉండేలా కోరారు. ప్రజలను తప్పు తోవ పెట్టేలా వార్తలు ఉండకూడదన్నారు.

భూ ఆక్రమణపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని ఎంఆర్ నగరం, పెదబొండపల్లిలో దళితుల భూములపై ఆక్రమణలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల, పట్టణ టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెదబొండపల్లి, ఎంఆర్ నగర్ పంత్రంలో దళితుల భూములను చుక్క శ్రీదేవి కబ్జా చేసి దళితులపై దాడులు దిగుతుందని ఆరోపించారు. దళితులకు ప్రభుత్వం ద్వారా సంక్రమించిన హక్కుల గల భూమిని ఆక్రమించి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ రెండు గ్రామాల దళితులు, రజకులను ఇబ్బందులకు గురి చేస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వంలో శ్రీదేవి ఆధీనంలో ఉన్న భూములు దళితులకు చెందినవే అని చెప్పిన అధికారులు పట్టించుకోలేదన్నారు. కేసులు పెట్టి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆమె చేసిన భూ అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్రను ఆశ్రయించామన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, పట్టణ టిడిపి అధ్యక్షులు రవి కుమార్, వంగపండు త్రినాథరావు, ఎమ్మార్ నగర్, పెదబోండపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని పెదబుడ్డిడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ శంభంగి రమేష్ గురువారం పరిశీలించారు. పనుల వద్దకు వెళ్లి మస్తర్లను తనిఖీ చేశారు. వేతన దారులతో మాట్లాడుతూ సమయ పాలన ప్రతి ఒక్కరూ పాటించి సకాలానికి పని ప్రదేశానికి చేరుకుని చేసిన పనికి తగ్గ వేతనాన్ని పొందాలని, ఒకరి పేరుకు బదులుగా మరొకరు వచ్చినట్లయితే వారి జాబు కార్డులను తొలగిస్తామని చెప్పారు. ఈయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వావిలపల్లి వరహాలనాయుడు తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురంలో చేస్తున్న ఉపాధి పనులను ఎంపిడి జి పైడితల్లి గురువారం పరిశీలించారు. పెదగుడబలో జరుగుతున్న పనులను ఎపిఒ గౌరీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించిన మస్తర్లను, పనులు పరిశీలించిన అనంతరం

గుమ్మలక్ష్మీపురం: కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సురేష్

క్షేత్ర సహాయకులకు తగు సూచనలు చేశారు. ఉపాధి పనుల్లో వేతనదారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా క్షేత్ర సహాయకులు తగు చర్యలు చేపట్టాలన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో నీడ ఉండేందుకు వీలుగా స్థానికుల సహకారంతో టెంట్లను ఏర్పాటు చేసేందుకు తగుచర్యలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకులు గాడి వెంకట నాయుడు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌పై అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పిఎం సూర్యఘర్ పథకంపై కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, జూనియర్ లైన్మెన్‌లకు ఎంపిడి డిడి స్వరూపరాణి గురువారం అవగాహన కల్పించారు. ప్రజలకు సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించాలని ఆమె సూచించారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పల్లె పండుగ పనులు ప్రగతి పైన ఈ సందర్భంగా ఆయా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దేవకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జోగారావు నాయుడు, హౌసింగ్ ఎఇ సింహాచలం పాల్గొన్నారు.

కురుపాం : ప్రధానమంత్రి సూర్యోగర్ యోజన పథకంపై ఎంపిడిఒ జి.ఉమామహేశ్వరి, విద్యుత్ శాఖ ఎఇ కోటేశ్వరరావుతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు ఎక్కువ వచ్చిన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సోలార్ స్కీమును సబ్సిడీ ద్వారా అందిస్తుందని, కావునఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటే విద్యుత్ బిల్లులు తక్కువ వస్తాయని సూచించారు.

సిసి రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

పల్లె పండగలో భాగంగా మండలంలోని గాజులవలసలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయాలలో నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. జానుముల వలసలో ఉపాధి హామీ పనులను పరిశీలించి ఉపాధి కూలీల మస్తర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పెద్దలు వై ప్రసాదరావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్యానల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా విద్యార్థుల విద్యాభివృద్ధి పురోగతిపై గురువారం మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నోడల్ హెడ్మాస్టర్ సిహెచ్ రత్నాకర్, హెచ్ఎం వై లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని బర్ని, గంగాడ, పెదపెంకి, నూకలవాడ, పలగర, నారాయణపురం, రావివలస గ్రామాలకు చెందిన పలు చెరువుల్లో గురువారం మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చేప పిల్లల పెంపకంపై మత్స్యకారులు దృష్టి సారించాలని ఎఫ్‌డిఒ శ్రీదేవి అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీపై చేప పిల్లలను విడుదల చేశామన్నారు. మొత్తం 11 చెరువుల్లో 1,47,044 చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, మత్స్యకార సహకార సంఘ ప్రెసిడెంట్లు, గ్రామ మత్స్య సహాయకులు ఎ.కీర్తి ప్రియ, కె శంకరరావు, పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమం మండలంలో పంచాయతీలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇఒపిఆర్‌డి గోపాలరావు అన్నారు. గురువారం మండలంలోని గొట్టువలస పరిధిలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రాల్లో తయారైన ఎరువులను రైతుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండల పరిధిలో ఇప్పటివరకు 12 చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోను చంద్రునాయుడు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

సీతానగరం: మండలంలోని కోట సీతారాంపురం రంగంపేట గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఇఒపిఆర్‌డి కెకె.కుమార్ వర్మ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త ద్వారా సంపద తయారీ చేసుకుని ఆ గ్రామ అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు వీధిదీపాల సమస్యలు లేకుండా చూడాలని ఆయా సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు కామేశ్వరరావు సర్పంచులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈ ఏడాది మార్చి 17 నుంచి జరుగునున్న పదో తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న ప్రతి విద్యార్థి చక్కగా చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీ గ్రేడ్ విద్యార్థులను సి గ్రేడ్‌కు వచ్చే విధంగా వారిపై ప్రత్యేక బాధ్యత వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వారికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, విద్యాసామర్థ్యాలు పెరిగే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని ఈ ఏడాది 220

విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ

హైస్కూల్లో, 67 పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో బాలుర, బాలికలు సుమారు 10,453 మంది విద్యార్థులు పరీక్షకు సిద్ధపడుతున్నట్లు తెలిపారు. 22 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈయనతో పాటు ఎంఇఒ-2 ఆర్ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి

కురుపాం: త్వరతగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ జి.రవి అన్నారు. మండలంలోని రస్తాకుంటు బాయ్, ఏగులవాడ పంచాయతీలో తోటగూడ, సీడీగూడ తదితర గిరిజన గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న పిఎంజెఎవై గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ బిల్లు పెండింగ్ లేకుండా పడుతున్న నేపథ్యంలో నిర్మాణం కూడా త్వరతగతిన పూర్తి చేసుకోవడానికి మంచి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జి.అచ్చయమ్మ, వర్క్ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపండు మద్దతుధర రూ.36

ప్రజాశక్తి - మక్కువ

డిఆర్ డిపోల ద్వారా గిరిజనులు సహకరించే చింతపండును కిలో రూ.36కు కొనుగోలు చేయనున్నట్లు జిసిసి సాలూరు మేనేజర్ జి.రామారావు తెలిపారు. మండలంలోని జిసిసి డిపోలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సీజన్‌కుగానూ రాష్ట్రంలో గిరిజన రైతులు సేకరించే పిక్కతో చింతపండుకు మద్దతు ధరను రూ.34 నుంచి రూ.36కు పెంచుతూ జిసిసి ఎండి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. కావున గిరిజన రైతులంతా వారు సేకరించే చింతపండును నాణ్యతా ప్రమాణాలు పాటించి దళారీల నుంచి మోసపోకుండా జిసిసికి అమ్ముకోవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. సాలూరు జిసిసి పరిధిలో గల 5 మండలాల్లోని 10పిపిసిల ద్వారా, 36 డిఆర్ డిపోల ద్వారా కొనుగోలును జరుపుతున్నామని తెలిపారు. కావున గిరిజన రైతులంతా డిఆర్ డిపోల వద్ద, పీపీసీల వద్ద సేకరించే చింతపండుతో పాటు ఇతర అటవీ ఉత్పత్తులను అమ్ముకోవల్సిందిగా ఆయన తెలిపారు. యజేశారు.

ఏనుగులను తరలించాలని నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

మన్యం జిల్లాలో తిష్ఠ వేసిన ఏనుగులను తక్షణమే తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఏనుగుల తరలింపు విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుంకి ఏనుగులను రప్పించే విషయంలో ఎంతవరకు చర్యలు తీసుకున్నారో అటవీశాఖ అధికారులు పత్రిక ప్రకటన ఇవ్వాలని కోరారు. ఈ మేరకు గురువారం నిరసన కార్యక్రమాన్ని మండల కేంద్రం